భారత్ గౌరవ్ రైలులో చార్ధామ్ యాత్ర

అమీర్‌పేట, ఫిబ్రవరి 22 : చార్ధామ్ యాత్రకు వెళ్లాలనుకునే వారికోసం 'భారత్ గౌరవ్ ట్రైన్' ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు టూ టైమ్స్ రీజనల్ మేనేజర్ రమేశ్ తెలిపారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వ యూనిట్ గఢ్వాల్ మండల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ పీఆర్‌ఓ వీరేందర్ సింగ్ రాణాతో కలిసి శనివారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మే 8 నుంచి ప్రారంభమయ్యే ఈ భారత్ గౌరవ్ రైలులో 16 రోజుల యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో హరిద్వార్, యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ క్షేత్రాల సందర్శన ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర 600 మంది ప్రయాణికులతో కూడుకున్నదని, రైలులో అందుబాటులో ఉన్న ప్యాంట్రీ, హౌస్ కీపింగ్, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సేవలు యాత్రికులకు గుర్తుండిపోతాయని రమేశ్ అయ్యంగార్ తెలిపారు. రైలు ప్రయాణంతో పాటు ఆయా క్షేత్రాలను సందర్శిస్తున్న సమయంలో కూడా చక్కటి భోజన వసతి సౌకర్యంతో పాటు రవాణా సదుపాయాలను కూడా ఉత్తరాఖండ్ ప్రభుత్వం యాత్రికులకు అందుబాటులో ఉంచిందన్నారు. భారత గౌరవ్ రైలులో చార్ధామ్ యాత్ర చేయాలనుకునే వారు మరింత సమాచారం కోసం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలోని టూర్ టైమ్స్ కార్యాలయంలో లేదా www. tourtimes. in సంప్రదించవచ్చన్నారు.

బీసీ కులగణనపై అవగాహన

ముషీరాబాద్, ఫిబ్రవరి 22. ప్రభుత్వం చేపడుతున్న వెనుకబడిన తరగతుల కుల గణన సర్వేలో పాల్గొని వివరాలు అందించాలని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్ కోరారు. శనివారం లలితానగర్ కమిటీహాల్ లో కుల గణన సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాంనగర్ నాగమయ్య కుంట, పద్మ కాలనీ, లలితా నగర్, బాలాజీ నగర్, సాయి చరణ్ కాలనీ, అచ్చయ్య నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బీసీ కులగణనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో అమలుచేసిన పథకాలు దేశానికే ఆదర్శం

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం రాంనగర్ డివిజన్, శ్రీరామ్‌నగర్ బస్తీలోని కమిటీ హాల్లో రూపుల వసంతా దయానంద్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ రాజశ్రీ వివేక్, రామంతాపూర్ మెడి ఐ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీ పథకాలతో పాటు, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో వంద మందికిపైగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వివేక్, శ్రీరాంగర్ బస్తీ వాసులు రాములు, హరినాథ్, గంగాధర్, సంతోశ్, గోపి, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కృష్ణా జలాలను దోచుకుంటున్నా పట్టదా..

చోద్యం చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : బీఆర్ఎస్ నేత నాగేశ్ ముదిరాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత నాగేశ్ ముదిరాజ్

ముషీరాబాద్ , ఫిబ్రవరి 22 : కృష్ణానది జలాలను ఏపీ ప్రభుత్వం దోపిడీ చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నేత నాగేశ్ ముదిరాజ్ ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్ రావు కృష్ణాజలాలపై మాట్లాడేంతవరకు ప్రభుత్వానికి సోయిలేకుండా పోయిందని ఉన్నారు. శనివారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కృష్ణాజలాల వాడకంపై నిర్వహించే సమావేశానికి హరీష్‌రావును ఆహ్వానించాలని కోరారు .గత పది సంవత్సరాలుగా మంత్రిగా, భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్‌రావుకు అపారమైన అనుభవం ఉందని, ఆయన అనుభవాన్ని తీసుకొని తెలంగాణలో రైతులకు సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి కోరారు. హరీష్‌రావు సూచనలు సలహాలు తీసుకుంటే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణం ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించాలని అన్నారు. బీజేపీ కేంద్ర మంత్రులు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, వారికి తెలంగాణ పట్ల చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణం నీటితరలింపును కేంద్రం నిలిపివేయాలని కోరారు. ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న హరీష్‌రావును ఫోన్ ట్యాపింగ్‌కేసులో ఇరికించేందుకు పోలీసు ఉన్నత అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గాంధీ దవాఖానలో రోగుల సహాయార్థం వంద భోజనం ప్లేట్లు, వంద గ్లాసులను శనివారం ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రికి అందజేస్తున్న సనత్‌నగర్ మోడల్ కాలనీలోని మా నవసేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు – బన్సీలాల్ పేట్

తెలంగాణ ఎస్‌సీ హక్కుల పరిరక్షణ సంఘం డైరీ ఆవిష్కరణ



తెలంగాణ ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్ , ఫిబ్రవరి 22: తెలంగాణ ఎస్‌సీ హక్కుల పరిరక్షణ సంఘం,రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని శనివారం వెస్ట్‌మారేడుపల్లిలోని తన కార్యాలయంలో కమిటీ ప్రతినిధులతో కలిసి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల జీవిత చరిత్రలు, వివిధ చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఫోన్ నంబర్లు తదితర వివరాలతో ఎంతోమందికి ఉపయోగపడే విధంగా డైరీని రూపొందించారని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్ బాబు, నగర ఉపాధ్యక్షులు కుర్మ మహేందర్, సనత్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు రాపాక అశోక్, సనత్‌నగర్ మాదిగ జాక్ నాయకులు త్రిశూల్ శ్రీకాంత్, మహిళా విభాగం నగర ప్రధాన కార్యదర్శి కవిత, అమీర్‌పేట్ మండల్ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాస్, కోడూరు పుష్పలత, దుంపల సందీప్, మధుసూదన్, బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్ కుమార్, రంజిత్ పాల్గొన్నారు

ఉచిత వివాహ పరిచయ వేదికకు స్పందన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22: ఎకనామిక్ టైమ్స్ మహా డెవలప్‌మెంట్ (ఈటీఎండీ) సంస్థ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నో ఫీస్, నో కమీషన్ పేరిట నిర్వహించిన మాదిగ వారి వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈటీఎండీ సంస్థ ఫౌండర్ డేవిడ్ రాజ్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరై పరిచయ వేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు భాస్కరరావు మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించిందన్నారు.. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రొఫెసర్ డేవిడ్, రాజేంద్రప్రసాద్, సాంబశివరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

వైద్య సేవలకు అధిక ప్రాధాన్యం

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి22 : నిరుపేదలు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. చిలకలగూడకు చెందిన బాలమణి, మంజుల వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.50 లక్షల మంజూరు పత్రాలను (ఎల్ఓసీ) శనివారం సీతాఫల్‌మండిలోని తమ క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫల్ మండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సుంకు రామచందర్, బాలరాజు గౌడ్, అశ్విన్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై మానవతా కోణంలో ఆలోచించండి

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 22 : వీధి వ్యాపారుల పట్ల అధికారులు మానవత కోణంలో ఆలోచన చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ దవాఖాన వద్ద చిరు వ్యాపారాలను ఇటీవల ట్రాఫిక్ పోలీసులు తొలగించడంతో వారందరూ సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలువగా.. ఆయన .. సమస్యను పరిష్కరించాలని బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యకు సూచించారు. ఆయన వెంటనే స్పందించి టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, జీహెచ్ఎంసీ లోని యూసీడ్, టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు, న్యాక్ అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు కలిసి గాంధీ దవాఖాన ప్రాంతాన్ని సందర్శించారు. ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం కలిగించకుండా వ్యాపారం చేసుకుంటే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని టాఫిక్ అధికారులు చేసిన సూచన మేరకు జీహెచ్ఎంసీ అధికారులు తదుపరి టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో తగు విధంగా ఆదేశాలు జారీ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ట్రాఫిక్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, ఏఈ సారిక, యూసీడీ అధికారి నర్సింహా, టౌన్ ప్లానింగ్ అధికారి జగదీశ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు వెంకటేశన్ రాజు, ఏసూరి మహేశ్, శ్రీకాంత్ రెడ్డి, అంబులెన్సు సురేశ్, మల్లేశ్, మహేందర్ గౌడ్, చారి పాల్గొన్నారు

సమస్యల పరిష్కారాకి కృషి : కార్పొరేటర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాకి కృషి చేస్తున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్, ఎస్ఆర్‌టీలో ఉన్న సివిల్ సప్లయ్ శాఖకు సంబంధించిన ప్రభుత్వ ఖాళీ స్థలంలో పేరుకుపోయిన మట్టి ,చెత్తా చెదారం తొలగింపు కార్యక్రమాన్ని శనివారం కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్ కుమార్ , ఉమేశ్, శ్రీనివాస్, సాయి కుమార్, ఆనంద్ రావు, రాంకీ సిబ్బంది మాధవి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి..



కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్త సతీశ్ గుప్తా

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 22: వేసవి కాలంలో కంటోన్మెంట్ ఐదవ వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సామాజిక కార్యకర్త తేలుకుంట సతీశ్ గుప్తా శనివారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఐదవ వార్డులో గతంలో 3 రోజులకు ఒక్కసారి తాగునీరు సరఫరా అయ్యేవని, వేసవి కాలం ప్రారంభంలోనే 4 నుంచి 5 రోజులకు ఒక్కసారి నీటి సరఫరా అవుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయని వాటిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన బోర్డు సీఈఓ సంబంధిత అధికారులను పిలిచి నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ఘనంగా వరల్డ్ థింకింగ్ డే

వరల్డ్ థింకింగ్ డేలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు

బేగంపేట్ ఫిబ్రవరి 22 : స్కాట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుల జయంతి సందర్భంగా వరల్డ్ థింకింగ్ డే (ఆలోచనా దినోత్సవాన్ని)ను శనివారం సర్దార్ పటేల్ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాంగోపాల్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై బెడెన్ పావెల్, లేడి బెడెన్ పావెల్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ గైడ్స్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు, ఇటీవల తమిళనాడు తిరిచిరాపల్లిలో నిర్వహించిన డైమండ్ జూబ్లీ జాంబోరీలో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్లను అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరావు, ఏఎస్ఐ సాంబ నాయక్, డాక్టర్ గీత, దక్షిణ మధ్య రైల్వే పీఆర్ఓ రాజేశ్, జిల్లా ఛీఫ్ కమిషనర్ కేవీ దేవ్ దత్, జిల్లా కార్యదర్శి రమేశ్ చందర్, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, ట్రైనింగ్ కమిషనర్ విజయభాస్కర్, ఆర్గనైజింగ్ కమిషనర్లు గౌరీ నాథ్ సంగీతా పాండే, కమిషనర్లు డాక్టర్ ఎంహెచ్ భతేనా, రాజేశ్వరి, విష్ణు ప్రసాద్. పలువురు స్కౌట్ మాస్టర్లు, గైడ్ క్యాప్టెన్లు, స్కౌట్స్, గైడ్స్,రోవర్స్, రేంజర్స్ పాల్గొన్నారు.

దేవనార్ అంధుల పాఠశాల వార్షికోత్సవం

దేవనార్ అంధుల పాఠశాలలో 33వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిబాబా గౌడ్, సహ వ్యవస్థాపకులు శ్రీమతి జ్యోతి లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. – బేగంపేట్

వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకాం ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, తదితర కోర్సుల మూడో సెమిస్టర్, ఎల్ఎల్ఎం మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 11లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈ నెల15 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైటట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల పరీక్షా తేదీల ఖారారు..

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలతో పాటు బీపీఈడీ వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలన్నారు.

పీజీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

ముషీరాబాద్ డీసీగా రామంజుల రెడ్డి

ముషీరాబాద్, ఫిబ్రవరి 22 : జీహెచ్ ఎంసీ సర్కిల్ 15 ముషీరాబాద్ నియోజకవర్గం డిప్యూటీ కమిషనర్‌గా రామంజుల రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు డీఎంసీగా పనిచేసిన ఖాదర్ మొయినుద్దీన్ కరీంనగర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రామంజుల రెడ్డిని నియమించారు.

2018 పీహెచ్‌డీ విద్యార్థుల థీసెస్ సమర్పణ గడువును పొడిగించాలి

ఓయూ రిజిస్ట్రార్ కార్యాలయం ముట్టడి.. ధర్నా

ఓయూ రిజిస్ట్రార్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న పరిశోధక విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని 2018 బ్యాచ్ పీహెచ్‌డీ విద్యార్థుల థీసెస్ సమర్పణ గడువును పొడిగించాలని డిమాండ్ చేస్తూ పరిశోధక విద్యార్థులు ఓయూ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం రిజిస్ట్రార్ కార్యాలయంలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ..తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2018లో ప్రారంభమై 2019 వరకు సాగిందని గుర్తు చేశారు. ప్రవేశాలు పొందిన మరుసటి సంవత్సరమే కరోనాతో రెండేళ్ల విలువైన సమయం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రీ పీహెచ్‌డీ పరీక్షను 2021లో నిర్వహించారని చెప్పారు. ఫెలోషిప్‌లు లేకపోవడంతో తమ పరిశోధనను సకాలంలో పూర్తి చేయలేకపోయామని పేర్కొన్నారు. డెడ్‌లైన్ పేరుతో నిరుపేద, గ్రామీణ పేద విద్యార్థులను మానసికంగా కుంగిపోయేలా చేయొద్దని కోరారు. సంవత్సరంపాటు తమకు గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. యూజీసీ నిబంధనల మేరకు తాము కోల్పోయిన విలువైన కరోనా సమయాన్ని తమకు పొడిగించాలని డిమాండ్ చేశారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ధర్నాను విరమించబోమని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్ పలుమార్లు వీసీతో ఫోన్లో సంప్రదించారు. ఈనెల 28లోపు స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిశోధక విద్యార్థులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు కొమ్ము శేఖర్, జీడి అనిల్‌కుమార్, జంగిలి దర్శన్, వలిగొండ నరసింహ, క్రాంతి నాయక్, ఆదివాసీ అరుణ్, మేడి కార్తీక్, క్రాంతిరాజు, పెద్దమ్మ రమేశ్, నాగరాజు, తప్పెట్ల ప్రవీణ్, సూర్యం, మేకల రవి, సుధీర్ కుమార్, అలేఖ్య, వాణి, కళ్యాణి, నాగమ్మ, సాయి భవానీ, పద్మ, రీతి, రజిత, జ్యోతి, కృష్ణవేణి, రమేశ్, శివ, లక్ష్మణ్, సందీప్, చందు, విజయ్‌కుమార్, ప్రభాకర్, కృష్ణ, రవి, నరేశ్, రాజు, వెంకటేశ్, మహేశ్, హేమ సుందర్, కరుణాకర్, సతీశ్, నాగేశ్వర్ రావు, శివరాజు, ధన్‌రాజు, శ్రీ యాదవ్, పరమేశ్, కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు బాధ్యతను మరింత పెంచుతాయి

కళాకారులతో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, సంస్థ అధ్యక్షుడు రత్నం , తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 : తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభను కనబరుస్తున్న వారికి పురస్కారాల ప్రదానోత్సవం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా టీపీఎస్‌కే అధ్యక్షుడు, ప్రముఖ కవి భూపతి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు.. వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి పురస్కారాలను అందించడం ద్వారా వారిని ప్రోత్సహించినట్లు అవుతున్నారు.. పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు.ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రత్నం, డాక్టర్ ఉషారాణి, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ జగదీశ్వర్ రావు, తెలంగాణ ఉద్యమకారుడు రుద్రాల స్వామి, ప్రతాప్ కుమార్, కోటేశ్వరరావు, కర్ణాటక సంగీత గాయకుడు బాలసుబ్రమణ్యం, నాట్య గురువు లావణ్య శ్రీ, తదితరులు పాల్గొన్నారు..

సమసమాజ స్థాపనకు యువత పాటుపడాలి

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 : దేశంలో అసమానతలు లేని సమసమాజ స్థాపన కోసం యువత ముందు బాగాన నడవాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ యువతకు పిలుపు ఇచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలోని పార్టీ నగర కార్యాలయంతో ఫిబ్రవరి 22, 23లలో జరుగుతున్న కార్యకర్తల శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజలను విభజించి పాలించే విధానం, మతపరమైన రాజకీయాలు కొనసాగుతున్నాయని వాటిని అడ్డుకోవడానికి యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేశ్ , పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్, శ్రీనివాసరావు, మహేందర్, నగర కమిటీ సభ్యులు కుమారస్వామి, నరేశ్, ఎన్. మారన్న, జి.కిరణ్, అశోక్ జావెద్, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలకు అండగా బీఆర్ఎస్

చిరు వ్యాపారుల వద్ద భోజనం చేస్తున్న కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట , ఫిబ్రవరి 22 : రోడ్డుపై పనిచేసుకునే చిరు వ్యాపారుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరు సునీత అన్నారు. మెట్టుగూడ ఆలుగడ్డబావి నుంచి తార్నాక వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా గత కొన్ని సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్న చిరు వ్యాపారుల బండ్లను ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్న నేపథ్యంలో మెట్టుగూడ – తార్నాక మీల్స్ ఫుడ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింత రమేశ్ కోరిక మేరకు శనివారం ఆమె చిరు వ్యాపారుల వద్దకు వెళ్ళారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి..అక్కడే భోజనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బడుగు బలహీన వర్గాల పై అణచివేత ధోరణిని ఆలంబిస్తుందని అన్నారు.